క్లుప్తంగా

రీ సర్వే వెరిఫికేషన్ పై గ్రామసభ



జక్కరంలో గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: ప్రభుత్వ భూములను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామాల్లో రీ సర్వే మొదటిదశ ప్రక్రియ పూర్తైన చోట గ్రామస్తులు, భూహక్కుదారులతో గ్రామసభలు నిర్వహించాలని వచ్చిన ఆదేశాల మేరకు కాళ్ల మండలం జక్కరం గ్రామంలో భూ రీసర్వే వెరిఫికేషన్ పై బుధవారం కాళ్ల తహసీల్దార్ కృష్ణారావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రీ సర్వేలో భూమి హద్దులు, విస్తీర్ణం, పాత సర్వేనెంబర్ వివరాలను రైతులకు వివరించారు. వీటిపై ఎటువంటి అభ్యంతరాలు రాలేదని తెలిపారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ కూచంపూడి పద్మావతి వీఆర్వో సుధాకర్, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు అత్తిలి మండలంలో మంత్రి కారుమూరి పర్యటన

అత్తిలి: నేడు అత్తిలి మండలంలో రాష్ట్ర పౌర సరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. గురువారం ఉదయం అత్తిలి గ్రామంలో వేంచేసియున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఊరేగింపు ఉత్సవంలో పాల్గొంటారని, అనంతరం ఉనికిలి గ్రామంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలు అందజేస్తారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

అవసరాల కోసమే స్థలాల సేకరణ

మునిసిపల్ కమిషనర్ శామ్యూల్

తాడేపల్లిగూడెం: పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అవసరాల నిమిత్తం ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా రహదారి విస్తరణ కోసం కె.ఎన్.రోడ్‌లో స్థలాలను సేకరించి, అవి ఇచ్చిన వారికి టీడీఆర్ బాండ్లు ఇచ్చామని కమిషనర్ ఏ.శామ్యూల్ బుధవారం ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. కెఎన్‌రోడ్డును మాస్టర్‌ప్లాను 100 అడుగులు రోడ్డుగా డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ 1988 సంవత్సరంలో ఆమోదం తెలిపారన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు 80 అడుగులు మాత్రమే ఉందన్నారు. దీంతో రెండు పక్కల పదేసి అడుగుల వంతున స్థలాలను తీసుకోవాల్సి ఉందన్నారు. దీని కోసం ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబరు 119, జీఓ నంబరు 180, జీఓ 179 ప్రకారం రోడ్డు విస్తరణ దృష్ట్యా తొమ్మిది మంది దగ్గర నుంచి స్థలాలను తీసుకొని, ఆయా స్థలాలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పురపాలక సంఘానికి రిజిస్టర్ చేయించి , ఆ స్థలానికి మార్కింగ్ చేసిన తర్వాత టీడీఎస్ బాండ్లు ఇచ్చామన్నారు. పెంటపాడు నుంచి పోలీసు ఐలాండ్ వైపునకు మూడు స్థలాలు, కుడి పక్కన ఆరు స్థలాలను తీసుకొని టీడీఆర్ బాండ్లు ఇచ్చామని, ఈ స్థలాలు మునిసిపాలిటీ ఆ. దీనంలోనే ఉన్నాయన్నారు. ఈ స్థలాలలో నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళికా విభాగ అధికారులను ఆదేశించామన్నారు. ఒక థియేటర్‌కు సంబంధించి ప్రహరీగోడను తొలగించాల్సి ఉందని, అది తొలగించుకోడానికి స్థల యజమాని 15 రోజులు సమయం అడిగారన్నారు. ఈ బాండ్ల విషయంలో ఎలాంటి అవకతవకలు జరుగలేదన్నారు. ఈ సమావేశంలో పట్టణ ప్రణాళిక అధికారి హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తణుకులో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు చాకలిచెరువు, జయంతి కాలనీలో బుధవారం ఫీవర్ సర్వే, మస్కిటో లార్వా, డెన్సిటీ, డెంగ్యూ నివారణ మాసోత్సవం వంటి కార్యక్రమాలపై ప్రజానీకానికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యాధుల నివారణకు ప్రతిరోజు తప్పనిసరిగా డ్రైడే పాటించాలని, వర్షాలు పడుతున్న నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చేతుల పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను భుజించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఫీవర్ సర్వే చేస్తున్న సమయాల్లో వలంటీర్లు, ఆశ కార్యకర్తలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ కె.పృథ్వీరాజ్, వార్డు హెల్త్ సెక్రటరీ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు ఆరోగ్య రక్ష

- వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో టాస్క్ ఫోర్స్ కమిటీలు
- ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమాల నిర్వహణ
- బాల్య వివాహాల నివారణ పై ప్రత్యేక దృష్టి



మొగల్లులో 104 వాహనం ద్వారా సేవలందించే వైద్య శిబిరంలో వైద్యారోగ్య సిబ్బంది



మొగల్లులో వైద్య సేవలు అందిస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ఇందిర, సునందలు

పాలకోడేరు: గ్రామీణుల ఆరోగ్యరక్షణకు ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. మారుమూల ప్రాంతాల ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పంచాయతీ స్థాయిలోనే టాస్క్‌ఫోర్సు కమిటీలను ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గతనెల 28న ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆరోగ్య రంగంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ) సాధనకు డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణులకు విస్తృత సేవలు అందించేందుకు టాస్క్‌ఫోర్సు కమిటీలచే సరికొత్త విధానానికి రూపకల్పన చేశారు. నియోజకవర్గంలోని మండలాల్లో సచివాలయాల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు కానున్నాయి.

ఆరుగురు సభ్యులతో కమిటీ

ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఆరుగురు సభ్యులతో కూడిన టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)సీహెచ్‌ఓ-మిడ్ లెవెల్ (ప్రొవైడర్-ఎంఎల్‌హెచ్‌ఓ) ప్రతి గ్రామంలో టాస్క్‌ఫోర్సుకమిటీ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్, స్కూల్ హెల్త్ అంబాసీడర్, గ్రామాల్లో డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ

గ్రామీణుల ఆరోగ్యంపై ఈ టాస్క్‌ఫోర్సు కమిటీ నిరంతరం పర్యవేక్షించాలి. ప్రధానంగా గర్భిణులు, శిశువులు, మహిళలు, వృద్ధులు, పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహారం లోపం ఉన్నవారినీ గుర్తించాలి. వారి అనారోగ్యాల నివారణ చర్యలు,గ్రామ ప్రజల జీవన శైలి, రోగాల నివారణ,చికిత్సలపై ఈ టాస్క్‌ఫోర్సు కమిటీ నిత్యం అప్రమత్తంగా ఉండాలి

- పాఠశాల విద్యార్థుల ఆరోగ్య వివరాలను స్కూల్లోనే హెల్త్ అంబాసిడర్ పర్యవేక్షించాలి. కౌమర దశలోని బాలికలను రోజూ ఐఎఫ్ఏ మాత్రలు పంపిణీ చేయాలి. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పోషకాహారం అందించాలి.
- యుక్త వయసు బాలికలకు శానిటరీ ప్యాడ్ల సరఫరా వివరాలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల మధ్యాహ్న భోజనం వివరాలను కమిటీ లీడర్లకు అందించాలి. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలి.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు పిల్లల రక్తహీనతపై పర్యవేక్షణ,గర్భిణులకు ప్రసవానికి ముందు, తర్వాత సంరక్షణ, నులిపురుగుల నిర్మూలన మందుల పంపిణీ, ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం అందించడం వంటి సేవలు సక్రమంగా అందేలా సమన్వయం చేసుకోవాలి
- గ్రామాల్లో నిర్వహించే డ్వాక్రా గ్రూపు సమావేశాలకు టీమ్ లీడర్ విధిగా హాజరయ్యేలా టీంలో ఉన్న డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి. గ్రూపు సభ్యుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకోవాలి. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇమ్యునైజేషన్ ద్వారా రోగ్య నిరోధకతను పెంచడం ద్వారా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు.
- బాల్య వివాహాలు నివారించడంతో పాటు యుక్త వయస్సులో గర్భాలను నిరోధించాలి. కుటుంబ నియంత్రణ ప్రణాళిక అమలు చేయాలి. ప్రతి శుక్రవారం డ్రైడే పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో సేవలందించేలా చూడాల్సిన బాధ్యత స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిపై ఉంటుంది.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



గ్రామాల్లో ఆరోగ్యపరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఆరుగురు సభ్యులతో టాస్క్‌ఫోర్సు కమిటీలను ఏర్పాటు చేస్తాం. సంపూర్ణ ఆరోగ్యం దిశగా పల్లెలను తీర్చిదిద్దుతాం. ఈ కమిటీల ఏర్పాటు ద్వారా గ్రామీణుల అనారోగ్య సమస్యలను పరిష్కరించవచ్చు. ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపేందుకు చర్యలు చేపట్టాం.

– నూకల మురళి గంగాధర్ రావు, ఎంపీడీవో పాలకోడేరు

ప్రజలకు ఎంతో ఉపయోగం

విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయి. ఆరోగ్యంతో పాటు వెలనెస్ కార్యక్రమం ద్వారా హార్ట్ ఎటాక్, క్యాన్సర్, హైపర్ టెన్షన్, డయాబెటిస్, టీబీ తదితర సమ్యలపై అవగాహన కల్పిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

– చిన్నమిల్లి రంగమనాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి, పాలకోడేరు

వలంటీర్లకు వందనం

వలంటీర్ల వల్లే మా ప్రాణాలు నిలిచాయి



భీమవరం 39 వార్డు దుర్గాపురంలో మా కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటాము. నాడు నలుగురికీ కరోనా సోకింది. అందరూ కరోనా అంటే భయపడుతున్న సమయంలో మా వలంటీర్ వెంకటేష్ ధైర్యంగా మా ఇంటికి వచ్చి మాకు మందులు, భోజనం వంటివి అందించేవాడు. తర్వాత అతడి సహకరంతో మేం కోవిడ్ కేర్ సెంటర్‌కు కూడా వెళ్లాం. మాబిడ్డ లాంటి వలంటీర్ వెంకటేష్ మా ప్రాణాలను నిలబెట్టాడు. అలాగే ఏడాది క్రితం భారీగా కురిసిన వర్షాలకు 39వ వార్డు దుర్గాపురంలో వరదలు వచ్చాయి. నడుం లోతు నీటిలో ముఖ్యంగా ఆడపిల్లలైన వలంటీర్లు కూడా వచ్చి మమ్మల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, భోజనం అందించడం వంటివి చేశారు. వారి వల్లే కరోనా అయినా వరదలు అయిన బతికి బయటపడ్డాం. –యలపర్తి అలువేలు మంగతాయారు, 39వ వార్డు, దుర్గాపురం

1వ తేదీనే పింఛన్



గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలని నెలలో మొదటి వారం రోజులు పాట పింఛన్ కోసం కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లం. అంతేకాకుండా కాళ్లనొప్పులు వస్తున్నా సరే నడుచుకుంటూ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి లైన్‌లో ఉంటే అప్పుడు పింఛన్ ఇచ్చేవారు. ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలో నెలలో 1న వలంటీర్లు ఇంటికి వచ్చి వేలిముద్ర వేయించుకుని పింఛన్ ఇస్తున్నారు. వ్యయ ప్రయాసలు లేకుండా పలానా టైమ్‌కు పింఛన్ ఇస్తున్నారు.

– నాగిడి వెంకటేశ్వర్లు, 98 సంవత్సరాలు, పింఛన్‌దారుడు, దొంగపిండి

దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలి

ఉండి: అధికారం కోసం పవన్‌కళ్యాణ్ చేస్తున్న దిగజారుడు వ్యాఖ్యలను మానుకుని వెంటనే వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర క్రిష్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్రపాటి అనిత ఓ ప్రకటనలో తెలిపారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు మరీ ఇంతగా దిగజారాల్సిన అవసరం లేదన్నారు. ఒకవైపు జనసేన కార్యకర్తలకు అన్యాయం చేస్తూ చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు పవన్‌కళ్యాణ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని విమర్శించారు.రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి అండగా నిలుస్తూ సంక్షేమ వారధులుగా పేరుగాంచిన వలంటీర్‌లపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి రాష్ట్ర ప్రజలకు వలంటీర్‌లు చేసిన సేవలు గుర్తు లేదా పవన్‌కళ్యాణ్ అంటూ ప్రశ్నించారు.అయినా కరోనా సమయంలో బయటకు వస్తే ప్రాణాలు పోతాయని నువ్వు,నీ పార్టనర్ చంద్రబాబు తెలంగాణా రాష్ట్రంలో దాక్కున్నారు కదా అంటూ మండిపడ్డారు. ఇప్పటికైనా తప్పుతెలుకుని వలంటీర్‌లకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని అనిత డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

భీమవరంలో వేగంగా ఇళ్ల నిర్మాణాలు

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



విస్సాకోడేరు లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్లు



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతుందని దీనితో పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి సాకారమవుతుందని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గం పేదల గృహ నిర్మాణం రాష్ట్రంలో 9వ స్థానంలో ఉండగా త్వరలోనే ప్రథమస్థానంలో నిలిచే విధంగా పని చేస్తున్నామన్నారు. విస్సాకోడేరు లే అవుట్‌లో 3,434 మందికి ఇళ్ల పట్టాలను అందించగా 2 వేల ఇళ్లు నిర్మాణాలు ప్రారంభమైతే అనేక గృహాల స్లాబ్ పనులు కూడా పూర్తయ్యాయన్నారు. జగనన్న లేఅవుట్‌కు సంబంధించి విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని రూ.2.50 కోట్లు వ్యయంతో విద్యుత్ సబ్ స్టేషన్ పనులు ప్రారంభించినట్లు శ్రీనివాస్ తెలిపారు. కాలనీలో లోఓల్టేజ్ సమస్య లేకుండా 62 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుతోపాటు అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 15 వేల మందికి పైగా ఇళ్ల స్థలాలను మంజూరు చేసి పట్టాలిచ్చామన్నారు. టీడీపీ పాలనలో పేదలకు ఇళ్లస్థలాల కోసం సెంటు భూమి కూడా ఇవ్వలేదని విమర్శించారు. నవరత్న పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించడమే కాకుండా ప్రభుత్వ పాలన ఇంటి ముంగిటకు తీసుకొచ్చిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేయడమేగాగక రాజకీయాలు, కుల,మతాలకు అతీతంగా అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వ వైఎస్సార్‌సీపీ అన్నారు.

యూత్‌హాస్టల్స్ కార్యక్రమాలు అభినందనీయం

సాహసోపేతమైన కార్యక్రమాలపై ఆసక్తి, పర్యావరణ పరిరక్షణకు అవగాహన కల్పించడంలో యూత్ హాస్టల్స్ అసోసియేషన్(వైహెచ్ఏ)చేపట్టిన ఉద్యమం యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బుధవారం భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో యూత్ హాస్టల్స్ కోరల్ జ్యూబ్లీ సెలబ్రేషన్స్ లోగో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 35 ఏళ్లగా భీమవరం వైహెచ్ఏ శాఖ సభ్యుల సంఖ్యను పెంచడంతో పాటు అనేక వినూత్న కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కిలిమంజూర, మౌంట్ ఎల్ బ్రోస్ వంటి ఎత్తైన శిఖరాలను అధిరోహించిన పట్టణానికి చెందిన జుజ్జువరపు ప్రవీణ్, కంచదపు లక్ష్మణ్, డాక్టర్ సోమరాజులను ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ చైర్మన్ మట్లపూడి సత్యనారాయణ, కార్యదర్శి నందమూరి రాజేష్, బొండా శ్రీరామ్, బోణం పాండురంగారావు, కటికి రెడ్డి వెంకటరత్నం, కట్రెడ్డి సత్యనారాయణ, పేరిచర్ల లక్ష్మణవర్మ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, బొండా రాంబాబు, కడియం ఈశ్వరరావు, దేవరపు చంద్రశేఖర్, నల్లం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

యువత సమాజ చైతన్యానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ జె.శ్యామలా దేవి

ఆకివీడు: యువత సమాజ చైతన్యానికి కృషి చేయాలని విశ్రాంత ప్రిన్సిపాల్ జె.శ్యామలాదేవి అన్నారు. మండలంలోని దుంపగడప గ్రామంలో వి.వి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారితా విభాగం ఆధ్వర్యంలో మహిళా హక్కుల సాధనకు గల అవకాశాలపై అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్యామలా దేవి మాట్లాడుతూ అనాధిగా మహిళలకు పలు సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయన్నారు. ఆధునిక యుగంలో మహిళ అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారని, పురుషులకు ధీటుగా మేమేమీ తక్కువ కాదన్నట్లుగా సమాజంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. అటువంటి మహిళలు సవాళ్లను తమకు అనుకూలంగా మార్చుకుని, అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. మంచి విషయాలు అందరి వద్ద నుంచి స్వీకరించి, ఆచరించాలన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాల ఔనత్యాన్ని కాపాడుకోవాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ కె.సుజాత మాట్లాడుతూ ప్రతీ మహిళా తన జీవితంలో చైతన్యంతో జీవనాన్ని గడపాలన్నారు. కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి నంమూరి వెంకట్రామరాజు(తాడినాడ బాబు) మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని చెప్పారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్యా పరంగా మహిళలు ఎదిగినప్పుడే సామాజంలో సముచిత స్థానం ఉంటుందన్నారు. సమావేశంలో శ్యామలాదేవిని ఘనంగా సత్కరించారు.

నేడు మూడు వార్డు సచివాలయాల్లో సురక్ష క్యాంపులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని 6,18,32, వార్డు సచివాలయలల్లో గురువారం జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.సుధాకర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు సచివాలయాల పరిధిలోని ప్రజలకు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు పట్టణంలో 16 వార్డు సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించామన్నారు. మొత్తం 8,465 సర్టిఫికెట్లు జారీ చేయగా అందులో 8,243 సర్టిఫికెట్లు అందజేశామన్నారు. 216 సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా వెంటనే అందజేస్తామన్నారు.

మండలంలో నాట్లు ప్రారంభం



కోపల్లె గ్రామంలో నాట్లు వేస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలో సార్వా నాట్లు ప్రారంభమయ్యాయి. అధికారుల సూచనల మేరకు జూన్ నెలాఖరికి నారుమడులు వేయడంతో పాటు జూలై నెలలో పలు గ్రామాల్లో నాట్లు కూడా వేస్తున్నారు. మండలంలో సుమారు 4,500 ఎకరాల్లో సార్వా సాగు జరుగుతుంది. ఇప్పటికే కోపల్లె, వేంపాడు, జక్కరం తదితర గ్రామాల్లో నాట్లు వేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా నాట్లు వేసేందుకు చేలను దమ్ము చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. అదేవిధంగా మండలంలోని దొడ్డనపూడి, కాళ్ల గ్రామాల్లో ప్రతి ఏడాది మాదిరిగానే కొందరు రైతులు ఎదజల్లే పద్ధతి ద్వారా వరి సాగుకు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాది సార్వాసాగుకు ఎంటీయూ 1061, 1318 రకాలతో పాటు సంపత్ స్వర్ణ రకాల వరి వంగడాలను రైతులు సాగు చేస్తున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు నేడు ఇంటర్వ్యూలు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఈనెల 13న నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరావు కోరారు. ఓఏఎస్(ఆఫీస్‌అసిస్టెంట్) ఎంఎల్‌టీ(మెడికల్ లాబ్‌టెక్నీషియన్) టైపు, షార్ట్‌హ్యాండ్, బయో కెమిస్ట్రీ సబ్జెక్టులు బోధించేందుకు గాను జులై 13న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టైపు, షార్ట్‌హేండ్ పోస్టులకు బీకాం 50 శాతం మార్కులతో పాస్ అయిన అభ్యర్థులు, బయో కెమిస్ట్రీ బోధించేందుకు 50 శాతం మార్కులతో ఎంఎస్సీ అర్హత , లేక ఎమ్మెస్సీ మైక్రోబయాలజీలో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు.

నేడు ముత్యాలమ్మకు ఆషాఢ సారె సమర్పణ

తాడేపల్లిగూడెం రూరల్: ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మ వారికి సారె గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సమర్పించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు పడాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

[illegible]
టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన [illegible]

పశ్చిమగోదావరి జిల్లా, ఆకివీడు మండలం, గుమ్ములూరు గ్రామంలో వేంచేసియున్న [illegible]

క్ర. సం.	[illegible]	[illegible]	[illegible]	[illegible]
1.	[illegible]	1.30	3.50	30,000/-

[illegible]

గ్రామం: గుమ్ములూరు
తేది :10-07-2023

అన్నం వెంకట శ్రీనివాసరావు
ఛైర్మన్

విద్యార్థుల విద్యపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషులత

తాడేపల్లిగూడెం రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని, కొంతమంది విద్యార్థులకు ఆరో తరగతిలోనూ వర్ణమాల రాని పరిస్థితి నెలకొందని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పానుకు మాటి శేషులత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధన తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యాబోధన చేయాలన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు రక్షిత మంచినీటిని అందించాలని కోరారు. గ్రామాల్లో దిగువకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని, లేదంటే ఈదురు గాలులకు తెగిపోయే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై ఎంపీపీ శేషులత మాట్లాడుతూ సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ మాట్లాడుతూ మండలంలోని ఐదు గ్రామాల్లో భూముల రీ-సర్వే కార్యక్రమం పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ రైతు తమ భూమిని సర్వే చేయించుకుని తమ పత్రాలను డిజిటలైజ్ చేసుకోవాలన్నారు. భూములకు ఖచ్చితమైన సరిహద్దులతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరమవుతుందన్నారు. జనన మరణాలను త్వరితగతిన పంచాయతీల్లో నమోదు చేసుకోవాలన్నారు. విద్యాశాఖ అంశంపై టీవోటీ రాజు మాట్లాడుతూ గతంలో పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఇంటి వద్దే ఉంటూ పరీక్షలు రాసేవారన్నారు. అయితే, నేడు ఆ పరిస్థితికి స్వస్తి చెప్పడం జరిగిందన్నారు. వారిని పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించి విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఉద్యాన శాఖ అంశంపై ఉద్యాన అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులకు వివరించి, వాటిని వినియోగించుకునేలా చూడాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులు పొందాలని, లేకుంటే పండించిన పంటను విక్రయించుకునే అవకాశం ఉండదన్నారు.

సురక్షతో అన్ని వర్గాలకు మేలు

అత్తిలి: జగనన్న సురక్ష కార్యక్రమంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుంద ని ఉనికిలి సొసైటీ అధ్యక్షుడు వట్టికూటి సూర్యనారాయణ చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు, అర్హత ఉండి, సాంకేతిక సమస్యతో సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రజలు తెలిపిన పలు సమస్యలను పరిష్కరిస్తామని ప్రజా ప్రతినిధులు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వట్టికూటి అనంతలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు ముదునూరి దుర్గాభవానీ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



అలంపురంలో స్తంభించిన ట్రాఫిక్

పెంటపాడు: మండలం అలంపురం గ్రామంలోని జయా గార్డెన్ నుంచి తాడేపల్లిగూడెంలోని సభాస్థలికి బుధవారం సాయంత్రం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ర్యాలీగా వెళ్లారు. ఈ సమయంలో జాతీయ రహదారి, తాడేపల్లిగూడెం -తణుకు రహదారులపై వాహనాలు భారీగా స్తంభించిపోయాయి. సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రాకపోకలకు ఆటంకం కలగడంతో బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లోని గృహిణులు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జనసైనికులు బస్సుపై ఎక్కి హల్‌చల్ చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
Office mail : tpgadvt@gmail.com